


డీఎంకే కార్యాచరణ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న స్టాలిన్

ఏడోసారీ అధికారంలోకి వస్తాం

200 సీట్లకు పైగా గెలుస్తాం

● కార్యాచరణ మండలిలో స్టాలిన్ ధీమా

చెన్నై, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని, ఆ ఎన్నికల్లో 200లకు పైగా సీట్లను గెలుచుకోవడం ఖాయమని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏడోసారి డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఇందులో ఎవరికీ ఎలాంటి సందేహం అక్కర్లేదని, అన్నాడీఎంకే, బీజేపీ కూటములను ఏర్పాటు చేసుకుని పోటీకి దిగినా, లేక ఒంటరిగా ఢీకొన్నా అంతిమ విజయం తమదేనని ఆయన చెప్పారు. తేనాంపేట అన్నా అరివాలయంలో ఆదివారం ఉదయం డీఎంకే కార్యాచరణ మండలి సమావేశానికి అధ్యక్షత వహించిన స్టాలిన్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కనుచూపు మేర బలమైన శత్రువులు లేరనే అహంకారంతో వ్యవహరించకూడదని డీఎంకే వ్యవస్థాకుడు అన్నాదురై, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తరచూ చెబుతుండేవారని, ఆ విధంగానే ప్రస్తుతం డీఎంకే కూటమిని ఢీకొట్టేందుకు సమ ఉజ్జీలైన పార్టీలు లేవనే అహంకారంతో పార్టీ శ్రేణులు ప్రవర్తించకూడదని, ఇంటింటికీ వెళ్ళి ప్రచారం చేసి, తీవ్రంగా కృషిచేసి విజయం సంపాదించాలన్నారు. 1957 నుంచి 2024 వరకు జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రతిపక్షాలకు చెందిన జాతీయ నాయకులను, రాష్ట్ర స్థాయి నాయకులను సమర్థవంతంగా ఎదిరించామని, ఎన్నికల ఫలితాలు సానుకూలంగా వచ్చినా ప్రతికూలంగా వచ్చినా ఎన్నడూ పిరికిపందల్లా వెనుకంజ వేయలేదన్నారు. దేశంలోనే 75 యేళ్లగా సంస్థాగతపరంగా చెక్కుచెదరని ప్రాంతీయ పార్టీగా డీఎంకే గుర్తింపు పొందిందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న ద్రావిడ తరహా పాలన సులువుగా రాలేదని, పదేళ్లపాటు అవినీతి అన్నాడీఎంకే ప్రభుత్వంపై నిర్విరామ పోరాటం చేయడం వల్లే సాధ్యపడిందన్నారు. కలైంజర్ మహిళా సాధికారిక నగదు పంపిణీ పథకం సహా మహిళాభ్యుదయాన్ని చాటిచెప్పే ఎన్నో పథకాలు అమలు చేశామన్నారు. ఈ పథకాలు సత్ఫలితాలివ్వటంతో ప్రజలంతా మళ్ళీ ద్రావిడ తరహాపాలన రావాలని ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షనేత ఎడప్పాడి(ఈపీఎస్)కి ప్రధాని నరేంద్రమోదీని విమర్శించే సత్తా లేదని, డీఎంకేపై అసత్య ప్రచారం చేయమంటే అందరికంటే ఆయనే ముందుంటారని చెప్పారు. సొంత పార్టీ వారికే ద్రోహం చేయడం మినహా ఈపీఎస్‌కు ప్రత్యేకచరిత్ర అంటూ ఏదీ లేదని స్టాలిన్ ఎద్దేవా చేశారు. తమ రాజకీయ ప్రత్యర్థులు ఓట్లను చీల్చడానికి ఒంటరిగా వచ్చినా, లేక గుంపులుగా వచ్చినా 2026 ఎన్నికలో డీఎంకే కూటమే ఘనవిజయం సాధిస్తుందన్నారు. అయితే ఈ గెలుపు సులువుగా వస్తుందని పార్టీ శ్రేణులు భావించకూడదని, గెలుపు కోసం ఇప్పటి నుండే పాటుపడాలని పిలుపునిచ్చారు.

12 తీర్మానాలు...

ఈ సమావేశంలో జమిలి ఎన్నికల ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని కోరుతూ, తుఫాన్ నిధులు విడుదల చేయని కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ 12 తీర్మానాలను ప్రతిపాదించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆ తీర్మానాల వివరాలు

- పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వైఖరిని ఖండిస్తూ తీర్మానం
- తుఫాను, వరద బాధితులను ఆదుకునేందుకు విపత్తుల నిధి నుండి కేంద్రం రాష్ట్రానికి నిధులు విడుదల చేయక పోవడాన్ని ఖండిస్తూ మరో తీర్మానం
- ఫెంగల్ తుఫాన్, వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం కోరిన రూ.6675కోట్ల మేరకు నిధులు కేటాయించని కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే దిశగా కేంద్రం ప్రతిపాదిస్తున్న జమిలి ఎన్నికలకు తీవ్ర ఖండన
- ఫెంగల్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయ చర్యలను సమర్థవంతంగా చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రశంస
- 2026లో జరిగే శాసనసభ ఎన్నికల్లో 200లకు పైగా సీట్లు గెలుచుకునేందుకు ఇప్పటి నుంచే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- రాష్ట్రంలో విద్యాశాఖకు అవసరమైన విడుదల చేయని కేంద్ర ప్రభుత్వ తీరుకు ఖండన
- కన్నియాకుమారి వద్దనున్న తిరువళ్లువర్ విగ్రహాన్ని ప్రజలంతా వారసత్వ సంపద చిహ్నంగా భావించాలంటూ తీర్మానం
- టంగ్‌స్టన్ తవ్వకాలకు కేంద్రం చేసిన చట్టాన్ని పరోక్షంగా ఆదరిస్తున్న అన్నాడీఎంకే తీరుపై ఖండన
- శ్రీలంక చెరలోని తమిళ జాలర్లందరినీ విడుదల చేయాలని, జాలర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని, కచ్చాదీవికి విముక్తి కలిగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం.




కోర్టుల వద్ద సాయుధ పోలీసులతో భద్రత

● డీఎస్పీలకు డీజీపీ శంకర్‌జివాల్ ఆదేశం



చెన్నై, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా కోర్టు వద్ద పోలీసుల సమక్షంలోనే ఓ యువకుడి హత్య జరిగిన నేపథ్యంలో ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నట్లు డీజీపీ శంకర్‌జివాల్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని కోర్టు వద్ద ఓ ఎస్‌ఐ ఆధ్వర్యంలో సాయుధ పోలీసుల బందోబస్తు చేయాలని డీఎస్పీలకు తాను ఆదేశాలు జారీ చేసినట్లు డీజీపీ చెప్పారు. తిరునల్వేలి జిల్లా కోర్టు వద్ద ఈ నెల 20న కేసు విచారణకు వస్తున్న మాయండి (25) అనే వ్యక్తిని కారులో వచ్చిన ఆరుగురు మారణాయుధాలతో దాడి జరిపి దారుణంగా హత్య చేశారు. ఆ సమయంలో కోర్టు ప్రాంగణంలో పోలీసులు కళ్లెదుటే హత్య జరుగుతున్నా ప్రేక్షక పాత్ర పోషించారు. లాయర్లు సాహసించి హంతకులను పట్టుకునేందుకు ప్రయత్నించి, ఒకడిని నిర్బంధించి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనపై మద్రాసు హైకోర్టు స్యుమోటా కేసుగా నమోదు చేసుకుని తిరునల్వేలి కోర్టు వద్ద జరిగిన హత్యకు సంబంధించిన వివరాలు, ఆ సమయంలో అక్కడి డ్యూటీ చేస్తున్న పోలీసులు తీసుకున్న చర్యలు గురించి నివేదిక సమర్పించమంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో డీజీపీ శంకర్‌జివాల్ రాష్ట్రంలోని డీఎస్పీలు, డీఐజీలు, ఐజీలు, పోలీసు కమిషనర్లకు ఓ సర్క్యులర్ జారీ చేశారు. రాష్ట్రంలోని కోర్టుల వద్ద ఎస్‌ఐ నాయకత్వంలో సాయుధ పోలీసులతో పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయాలని ఆ సర్క్యులర్‌లో ఆదేశించారు. కోర్టు వద్ద డ్యూటీ చేసే ఎస్‌ఐ కూడా తన వద్ద రివాల్వర్ ఉంచుకోవాలని పేర్కొన్నారు. కోర్టు ప్రాంగణాల్లో ఏవైనా దాడులు జరిగినా, ఎవరికైనా ప్రాణానికి హాని కలిగే పరిస్థితులు ఏర్పడితే అందుకు కారణమైనవారిపై ఆత్మరక్షణ కోసం పోలీసులు కాల్పులు జరుపవచ్చుననే విషయాన్ని మరచిపోకూడదని కూడా ఆ ఉత్తర్వుల్లో డీజీపీ గుర్తు చేశారు. కోర్టుల వద్ద భద్రతా విధులు నిర్వహించే సాయుధ పోలీసులు తమ భద్రతకు సంబంధించిన వివరాలను నివేదికగా ఉన్నతాధికారులకు సమర్పించాల్సి ఉంటుందని శంకర్ జివాల్ తెలిపారు.

హఠాత్తుగా హస్తినకు గవర్నర్



చెన్నై, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆకస్మికంగా హస్తిన బయలుదేరి వెళ్ళారు. గవర్నర్‌గా ఆయన పదవీ కాలం గత యేడాదే ముగిసింది. కొత్త గవర్నర్‌ను నియమించేంతదాకా ఆయనే కొనసాగనున్నారు. ప్రస్తుతం వీసీల నియామకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి, ఆయనకు మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోంది. వీసీల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసే సెర్చి కమిటీలో యూజీసీ సభ్యుడు కూడా ఉండాలని గవర్నర్ వాదిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ ముగ్గురు సభ్యులతోనే సెర్చి కమిటీ ఏర్పాటు చేస్తున్నామని, నాలుగో సభ్యుడిగా యూజీసీ ప్రతినిధిని చేర్చే ప్రసక్తేలేదంటూ ఉన్నతవిద్యాశాఖ మంత్రి కోవి చెలియన్ వాదిస్తున్నారు. ఈ వివాదం కారణంగా రాష్ట్రంలో మూడు విశ్వవిద్యాలయాల వీసీల నియామకంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇక వచ్చే యేడాది జనవరి 6న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రసంగంతో ప్రారంభం కానున్నాయి. గత శాసనసభ సమావేశాల్లో ప్రవర్తించినట్లుగా గవర్నర్ రవి ఈ సారి కొత్తయేడాది ప్రారంభ శాసనసభ సమావేశంలో ప్రవర్తించరనే అనుకుంటున్నామని స్పీకర్ అప్పావు ప్రకటించారు. అటు వీసీల వివాదం, ఇటు అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని చదివే విషయంలో పాలక పక్షం కట్టుబాట్లు అమలు చేయడానికి చేస్తున్న ప్రయత్నాల నడుమ ఆయన ఆదివారం ఉదయం ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు. గవర్నర్ ప్రయాణం వ్యక్తిగతమైనదని రాజ్‌భవన్ వర్గాలు చెబుతున్నప్పటికీ, ఢిల్లీలో ఆయన వీసీల వివాదం, అసెంబ్లీ సమావేశంలో పాల్గొనటం వంటి విషయాలపై బీజేపీ పాలకుల సలహాలను స్వీకరించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.


మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి రచనలను జాతికి అంకితం చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వు కాపీని ఆయన సతీమణి రాజాత్తి అమ్మాళ్‌కు, కుమార్తె కనిమొళికి అందజేస్తున్న తమిళభాషాభివృద్ధి, సమాచార శాఖల మంత్రి ఎంపి సామినాథన్

అంబేడ్కర్‌ను ఎవ్వరు విమర్శించినా ఘోర తప్పిదమే

● క్రిస్మస్ వేడుకల్లో ఈపీఎస్

పార్రీస్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాత్రమే కాకుండా ఎవ్వరు విమర్శించినా క్షమించరాని ఘోర తప్పిదమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. కీల్పాక్‌లోని సీఎస్‌ఐ లైట్ ఆడిటోరియంలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకలను ఈపీఎస్ కేక్ కట్‌చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఫాదర్లు జెబరాజ్, అంతోని స్వామి తదితరులకు కేక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ.. 43 నెలల డీఎంకే పాలనలో రాష్ట్రవ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలు పెరిగాయని అయినా పోలీసు శాఖదీని గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులెవ్వరూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని విమర్శించలేదని, బీజేపీ పెద్దలకు అనిగిమనిగి ఉంటూ ద్వంద వైఖరి ప్రదర్శిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రులు పీ.బెంజమెన్, పొన్నయన్, డి.జయకుమార్, నత్తం విశ్వనాథన్, దిండుగల్ శ్రీనివాసన్, ఎస్‌పీ.వేలుమణి, సినీనటి గౌతమి తదితరులు పాల్గొన్నారు.


ఫాదర్ జెబరాజ్‌కు కేక్ తినిపిస్తున్న ఎడప్పాడి

తొలి స్త్రీ వాది, అభ్యుదయవాది మాలతీ చందూర్

● జయంతి సభలో వక్తలు


వక్తను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఐసిఎఫ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి దివంగత మాలతీ చందూర్ మొట్టమొదటి స్త్రీవాది, అభ్యుదయ వాదని వక్తలు కొనియాడారు. మైలాపూర్ ఆంధ్ర మహిళ సభ హాలులో ఆదివారం జరిగిన జయంతి సభ కార్యక్రమం లక్ష్మీప్రసన్న ప్రార్థనాగీతంతో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జలంధర, మాలతీ చందూర్ రచించిన 'భూమి పుత్రి' నవలలో దుర్గ అనే పాత్ర విశేషాలను వివరించారు. మాలతీ చందూర్ గురించి ప్రబల జానకి మాట్లాడుతూ... పావలా ప్రభ ఇచ్చిన మనశ్శాంతి రూ.10 వేల టీవీ కూడా ఇవ్వలేదని మాలతి చందూర్ పదేపదే చెబుతుండేవారన్నారు. సరోజిని ప్రేమ్ చంద్ మాట్లాడుతూ... మాలతీ చందూర్ రచనలు నిజజీవితంలో జరిగే సన్నివేశాలే ఉంటాయన్నారు. మొట్టమొదటి స్త్రీ వాది, అభ్యుదయవాదిగా మాలతీ చందూర్ పేరుగడించారని అన్నారు. 'ఆంధ్రభూమి' పత్రికలో 'మైత్రి' అనే శీర్షికను మాలతి ప్రోత్సాహంతోనే ప్రారంభించానని జలంధర ఈ సందర్భంగా తెలిపారు.

మెట్రోరైలు పనులు

● కుంగిన ఇంటి నేల

చెన్నై, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెస్ట్‌మాంబళంలో జరుగుతున్న మెట్రోరైలు రెండో దశ నిర్మాణ పనులతో ఓ ఇంటి నేల కుంగటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. వెస్ట్ మాంబళం లాలా తోట్టమ్ ప్రాంతం వద్ద మెట్రో రైలు సొరంగ మార్గం తవ్వక పనులు జరుగుతున్నాయి. కొద్ది రోజులుగా భారీ యంత్రాలను తెప్పించి తవ్వకాలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం భారీ యంత్రం ద్వారా భూమిలో తవ్వుతుండగా అక్కడికి సమీపంలోని ఓ ఇంటి నేల అరడుగు లోతున కుంగింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.. వెంటనే మెట్రోరైలు కార్మికులు ఇంటిలో కుంగిన చోట సిమెంట్ మిశ్రమాలను సరిచేశారు.


వెస్ట్‌మాంబళం లాలా తోట్టమ్ వద్దనున్న ఓ ఇంటిలో కుంగిన నేల

సమాచార దృష్టి

మేట్టుపాళయం-ఊటీ ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, న్యూ ఇయర్ సందర్భంగా పర్యాటకుల సౌకర్యార్థం మేట్టుపాళయం-ఊటీ-మేట్టుపాళయం మధ్య ప్రత్యేక కొండ రైలు నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. మేట్టుపాళయం నుంచి ఈ నెల 25,27,29,31 తేదీల్లో ఉదయం 9.10 గంటలకు బయల్దేరే రైలు మధ్యాహ్నం 2.25 గంటలకు ఊటీ చేరుకుంటుంది. అలాగే, ఊటీ నుంచి ఈ నెల 26,28,30, జనవరి 1వ తేది ఉదయం 11.25 గంటలకు బయల్దేరే రైలు సాయంత్రం 4.20 గంటలకు మేట్టుపాళయం చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలిపింది.

అవనియాపురం జల్లికట్టు ఏర్పాట్లకు టెండర్లు

వాషర్‌మెన్‌పేట,డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): అవనియాపురం జల్లికట్టు పోటీలు నిర్వహించే ప్రాంతంలో వసతుల ఏర్పాటుకు మదురై కార్పొరేషన్ టెండర్లను ఆహ్వానించింది. సందర్శకుల గ్యాలరీ బ్యారికేడ్, తాగునీరు, రోడ్డు తదితర పనులకు రూ.5.18 లక్షలతో టెండర్లు ఆహ్వానించింది. జనవరి 3వ తేది సాయంత్రం 4 గంటలకు టెండర్లు పరిశీలిస్తామని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

పూర్తిస్థాయికి చేరువలో మేట్టూరు జలాశయం

పెరంబూర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు జలాశయం 120 అడుగుల పూర్తి సామర్థ్యానికి చేరుకోనుంది. కావేరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మేట్టూరు జలాశయానికి నీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వచ్చే నీరు తగ్గింది. ప్రస్తుతం జలాశయంలోకి 2,886 ఘనపుటడుగుల నీరు వస్తుండగా, డెల్టాసాగుకు 800 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 119.22 అడుగులతో 92.22 టీఎంసీల నీటినిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

వండలూరు జూలో కనుమ ఏర్పాట్లపై సమీక్ష

ఐసిఎఫ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూ పార్క్ సందర్శనకు ప్రవేశ టిక్కెట్టు ధర రూ.200 ఉండగా, గత కనుమ పండుగ సందర్భంగా ఈ జూ సందర్శనకు సుమారు 23,000 మంది వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, గతంతో పోల్చితే ఈ ఏడాది తక్కువ సంఖ్యలో సందర్శకులు రావడంతో జూ నిర్వాహకులు రానున్న కనుమ పండుగకు ఎక్కువ సంఖ్యలో సందర్శకులు వచ్చేలా ఏర్పాట్లు చేసేందుకు శనివారం అటవీ, రెవెన్యూ, జూ పార్క్ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానిక సంస్థల అధికారులు సమావేశమయ్యారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల నుంచి వండలూరు జూ పార్క్‌కు ప్రత్యేక బస్సులు నడపాలని సమావేశంలో నిర్ణయించారు.

జర్మనీలో నర్సుల ఉద్యోగాలు

పెరంబూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జర్మనీ దేశంలో నర్సుల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ విదేశీ ఉద్యోగాల కల్పన సంస్థ అధ్యక్షుడు పవన్‌కుమార్ విడుదల చేసిన ప్రకటనలో... జర్మనీ దేశంలో బి1, బి2 స్థాయి జర్మన్ భాషా పరీక్షలో ఉత్తీర్ణులై, 6 నెలల అనుభవం కలిగిన 38 ఏళ్లలోపున్న డిప్లొమో, డిగ్రీ పూర్తిచేసిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి సుమారు రూ.2 లక్షల వేతనం అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు తమ వివరాలు, తగిన సర్టిఫికెట్లతో కూడిన దరఖాస్తులను ovemclmohsa2021@gmail.com అనే ఈ-మెయిల్ జనవరి 5వ తేదిలోపు పంపించాలి. మరిన్ని వివరాలకు www.omcmanpower.tn.gov.in అనే వెబ్‌సైట్, 044-2250 5886, 6379179200 నెంబర్లను సంప్రదించవచ్చు.

డీఏపీ బస్తా ధర రూ.200 పెంపు

ఐసిఎఫ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డీఏపీ ఎరువుల బస్తా ధర జనవరి నుండి రూ.200లకు పెంచనున్నట్లు ఆ కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. పంట పెరుగుదల, పురుగుల నివారణకు యూరియా, డీఏపీ, పొటాషియం, మరికొన్ని రసాయనాలు రైతులు విపరీతంగా వాడుతుంటారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు యూరియా బస్తాలకు సబ్సిడీ ఇస్తోంది. డీఏపీ ఎరువులు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొని 50 కిలో ల బస్తా ప్రస్తుతం రూ.1350కు విక్రయిస్తున్నారు. ఎరువుల వాడకం ఎక్కువ కావడంతో ఎరువుల తయారీ కంపెనీలు బస్తా కు రూ.200 పెంచనున్నట్లు సమాచారం.

మెము రైళ్లకు బోగీల తగ్గింపు

పెరంబూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యూపీలో జరుగనున్న కుంభమేళాకు అదనపు రైళ్ల, బోగీలు అవసరమవుతున్నాయి. ఈ కారణంగా దక్షిణ రైల్వే పరిధిలోని 10 మెము రైళ్లకు తలా 2 బోగీలు తగ్గించనున్నారు. ఎగ్మూర్ నుంచి పుదుచ్చేరికి ఉదయం 6.35 గంటల మెము, పుదుచ్చేరిలో నుంచి మధ్యాహ్నం 2.55 గంటలకు తిరుపతి వెళ్లే రైలు, తిరుపతి నుంచి ఉదయం 4.30 గంటలకు పుదుచ్చేరి వెళ్లే రైలు, పుదుచ్చేరి నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు ఎగ్మూర్ వెళ్లే మెము రైళ్లకు ఆదివారం నుంచి తలా రెండు బోగీలు తగ్గించారు. అలాగే, విల్లుపురం నుంచి తాంబరం వెళ్లే రైలు, తాంబరం నుంచి విల్లుపురం వెళ్లే రైలు, విల్లుపురం నుంచి చెన్నై బీచ్, అక్కడ నుంచి సాయంత్రం 6 గంటలకు తిరువణ్ణామలై వెళ్లే మెము రైళ్ల ఈ నెల 26వ తేది నుంచి రెండు బోగీలు తక్కువతో నడువనున్నాయి. ఇక, తాంబరం నుంచి ఉదయం విల్లుపురం, తిరువణ్ణామలై నుంచి తెల్లవారుజామున తాంబరం వెళ్లే మెము రైళ్ల ఈ నెల 27 నుంచి రెండు బోగీలు తగ్గించి నడువనున్నాయని, తదుపరి ప్రకటన వచ్చే వరకు ఈ మెము రైళ్ల రెండు బోగీలు తక్కువగా నడుస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది.

ఆ షాపులు, సోకులూ మాకొద్దు

మళ్లీ రోడ్‌పక్కనే చేపల అమ్మకాలు ● రూ.15 కోట్ల మార్కెట్ నిరుపయోగమేనా?



కొత్త మార్కెట్ బయట చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు - కొత్త మార్కెట్‌లోపల చేపలు అమ్ముతున్న వ్యాపారులు (ఫైల్‌ఫొటో)

టి.నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సింగారచెన్నై 2.0 పథకంలో భాగంగా మెరీనాబీచ్‌లో లైట్‌హౌస్ ప్రాంతానికి చేరువలో లూప్‌రోడ్డులో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో విదేశీ విమానాశ్రయ భవనాలను తలపించేలా రూ.15 కోట్లతో నిర్మించిన కొత్త చేపల మార్కెట్ ప్రస్తుతం నిరుపయోగంగా మారుతోంది. ఆ మార్కెట్‌లో దుకాణాలు పొందిన వ్యాపారులంతా ప్రస్తుతం ఆ భవనం వెలుపల గతంలా లూప్‌రోడ్డు వైపే దుకాణాలు తెరచి చేపలు విక్రయిస్తున్నారు. సకల సదుపాయాలతో 366 దుకాణాలు కలిగిన చేపల మార్కెట్‌లో 50 శాతానికి పైగా వ్యాపారులు ప్రత్యేకించి మహిళలకు షాపులు కేటాయించారు. కొత్త చేపల మార్కెట్‌ను ఆగస్టులో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. అక్టోబరులో ఆ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా వ్యాపారం చేసుకునేవారికి కొత్త మార్కెట్‌లో దుకాణాలను కూడా కేటాయించారు. ఆ చేపల వ్యాపారులకు, కొనుగోలుదార్ల కోసం మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, చేపలను శుభ్రం చేయడానికి రెండు ప్రత్యేక ప్రాంతాలు, మురుగునీటిని శుద్ధీకరించే కేంద్రం, పార్కింగ్ ఇలా అన్ని హంగులున్నాయి. గత నెల రోజులుగా ఈ కొత్త మార్కెట్‌లో దుకాణందార్లు చేపలు అమ్మేందుకే ఇష్టపడ కుండా గతంలా లూప్‌రోడ్డుకు ఇరువైపులా దుకాణాలను తెరిచేశారు. దీంతో చేపలు కొనేందుకు మార్కెట్‌లో అడుగులపెట్టాల్సిన అవసరమే లేకుండా పోయింది. దీంతో ఆ కొత్త మార్కెట్‌లోని దుకాణాలకు చేపలు కొనేందుకు ఎవరూ వెళ్లటం లేదు. అంతే కాకుండా కొత్త మార్కెట్‌లో చేపల వ్యాపారులు తమకు కేటాయించిన స్థలాల్లో దుకాణాలను తెరవటమే లేదు. చేపల వ్యాపారులు ఎక్కడబడితే అక్కడ దుకాణాలు పెడుతుండటంతో ఏ లక్ష్యంతో ఈ కొత్త చేపలమార్కెట్‌ను నిర్మించారో దానికి గండిపడింది. ప్రస్తుతం మెరీనాబీచ్ సందర్శకులంతా మునుపటిలా లైట్‌హౌస్ ప్రాంతానికి చేపల కంపు భరించలేక ముక్కు మూసుకుని వాకింగ్‌కు వెళుతున్నారు. ఈ విషయమై చేపలవ్యాపరులను ప్రశ్నించగా... కొత్త మార్కెట్ భవనంలో అన్ని హంగులున్నాయని, అయితే ఈ మార్కెట్ లోపల ముందున్న వ్యాపారుల వద్దే చేపలు కొంటున్నారని, వెనుక వైపున్న రెండు మూడు వరుసల్లో చేపల వ్యాపారుల ఆ‌దగ్గరకు ఎవరూ రావటం లేదని, రోజుంతా ఇదే పరిస్థితిలో ఆ వ్యాపారులు వ్యాపారం సాగక నష్టపోతున్నారని చెప్పారు. ఈ సమస్య చెబుతామంటే కార్పొరేషన్ అధికారులు ఎవరూ రావటం లేదన్నారు. ఈ మార్కెట్ ప్రారంభించిన నెలలోపే వెనుక దుకాణాల వారంతా మార్కెట్ బయటకు వచ్చి ఎప్పటిలాగే తమకు నచ్చిన చోట కూర్చుని చేపలమ్ముకుంటున్నారని తెలిపారు. తమకు శాశ్వత దుకాణాలను కేటాయించడానికి బదులుగా ఈ మార్కెట్‌లో ముందువరుసలోనే చేపలమ్ముకునేలా వ్యాపారులకు రొటేషన్ పద్ధతిని అమలు చేస్తే బాగుంటుందని చెప్పారు. ఇదిలా ఉండగా కొంతమంది చేపలవ్యాపారులు తమకు కేటాయించిన దుకాణాలను లక్షలాది రూపాయలకు లీజుకిచ్చి వెళ్లిపోయారని, ఈ విషయంపై కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి వారం కార్పొరేషన్ అధికారులు ఈ కొత్త మార్కెట్‌కు వచ్చి తనిఖీ జరిపితే పరిస్థితి మారవచ్చునని మార్కెట్ లోపలే దుకాణాలు నడుపుతున్న చేపల వ్యాపారులు చెబుతున్నారు. ఈ విషయమై కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ మెరీనాబీచ్ లూప్‌రోడ్డులో మళ్లీ చేపలమ్ముతున్న సంగతి తమ దృష్టికి వచ్చిందని, త్వరలో అందరూ కొత్త మార్కెట్‌లోనే చేపలు అమ్ముకునేలా చర్యలు చేపడతామని తెలిపారు.

సిప్కాట్ ప్రాంగణాల్లో క్రీడా మైదానాలు

పెరంబూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్మాగారాల్లో పనిచేసే కార్మికుల కోసం శ్రీపెరుంబుదూర్ సహా మూడు సిప్కాట్ ప్రాంగణాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఒక్కో పార్క్ ఏర్పాటుకు తలా 2 ఎకరాలు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం 'సిప్కాట్' ద్వారా ఏర్పాటుచేసిన 40 పారిశ్రామికవాడల్లోని 3,275 సంస్థల్లో సుమారు 7 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికులు సేదతీరేలా తొలివిడతగా కాంచీపురం జిల్లా శ్రీ పెరుంబుదూర్, తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి, తూత్తుకుడి తదితర మూడు సిప్కాట్ ప్రాంగణాల్లో మొత్తం రూ.6 కోట్లతో క్రీడా మైదానాలు ఏర్పాటుకానున్నాయి. ఆయా ప్రాంతాల్లోని కర్మాగారాల యజమానులు కమిటీలు వేసుకొని ఈ మైదానాలు పరిరక్షించాలని ప్రకటన వెలువడింది.

'ఆన్‌లైన్ రమ్మీ' నిషేధించాలి

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

ప్యారీస్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ జూదాలకు బానిసై ఎన్నో కుటుంబాలు వీధినపడుతున్నాయని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో, చదువుకున్న యువత జీవితాలను బలిగొంటున్న ఆన్‌లైన్ రమ్మీ గేమ్స్‌ను నిషేదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ గేమ్స్ కారణంగా రాష్ట్రంలో 17 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని, మరోసారి ఇలాంటి బాధాకరమైన సంఘనలు జరగకుండా రాష్ట్రప్రభుత్వం ఆన్‌లైన్ గేమ్స్‌లపై నిషేధానికి సంబంధించిన విషయాలను సుప్రీంకోర్టు కు తీసుకెళ్లి వీటిపై పూర్తిస్థాయిలో నిషేధం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్బుమణి అన్నారు.

విద్యుదాఘాత మృతులకు పరిహారం పెంపు

ఐసిఎఫ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి: విద్యుత్ ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు పరిహారం ఇస్తుండగా, ప్రస్తుతం ఆ పరిహారం రూ.10 లక్షలకు పెంచారు. ఒకవేళ ప్రమాదవశాత్తు గాయపడి రెండు చేతులు, రెండు కాళ్లు, రెండు కళ్లు కోల్పోయిన బాధిత కుటుంబానికి అందిస్తున్న పరిహారం రూ.2 లక్షలు, ఒక చేయి, ఒక కాలు, ఒక కన్ను కోల్పోయిన బాధితులకు అందించే పరిహారం రూ. లక్ష నుంచి రూ.1.5 లక్షలకు పెంచారు. విద్యుత్ ప్రమాదంలో పశువులు, గేదె, ఆవులు మరణిస్తే రూ.25 వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో 1,413 ఛార్జింగ్ కేంద్రాలు

పెరంబూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వాహనాలను ఛార్జింగ్ వసతి అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తమిళనాడు 1,413 కేంద్రాలతో ఐదో స్థానంలో ఉంది. విద్యుత్ వాహనాలకు ఛార్జింగ్ సదుపాయం కల్పించేలా జాతీయ రహదారుల్లో 23 కి.మీ ఒకటి, పట్టణ ప్రాంతాల్లో 3 కి.మీ ఒకటి చొప్పున ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందుకోసం, ఇండియన్ ఆయిల్ ఎఫిషియన్సీ సర్వీస్ తదితర ప్రాంతాల్లో ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటుచేస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 25,202 ఛార్జింగ్ కేంద్రాలుండగా, రాష్ట్రం 1,413 కేంద్రాలతో ఐదో స్థానంలో నిలిచింది. 5,765 ఛార్జింగ్ కేంద్రాలతో కర్ణాటక మొదటి స్థానంలో ఉంది.

'కాలర్ ట్యూన్' ద్వారా ఆన్‌లైన్ నేరాలపై అవగాహన

పెరంబూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'కాలర్ ట్యూన్' ద్వారా ఆన్‌లైన్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, సైబర్ నేరాలు కూడా అధికమవుతున్నాయి. కొత్త కొత్త మార్గాల్లో అజ్ఞాత వ్యక్తులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. 'డిజిటల్ అరెస్ట్' అనే వీడియో కాల్ ద్వారా, సెల్‌ఫోన్ ద్వారా సంప్రదిస్తున్న అపరిచిత వ్యక్తులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ఈ సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేలా కేంద్ర టెలీ కమ్యూనికేషన్ విభాగం, టెలికాం కంపెనీలు సంయుక్తంగా అవగాహన ప్రచారం చేపట్టాయి. ఆ ప్రకారం, అన్ని టెలికాం సంస్థలు తమ వినియోగదారుల సెల్‌ఫోన్‌కు కాలర్ ట్యూన్‌గా సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం ప్రారంభించాయి. ఈ అవగాహన ప్రచారం రానున్న మూడు నెలలు, ప్రతిరోజు 8 నుంచి 10 సార్లు ప్రసారానికి చర్యలు చేపట్టాయి. ఈ అవగాహన పదాల తర్వాతే, కాల్స్ బయటకు వెళ్తాయని అధికారులు తెలిపారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



విజేతలతో జీవీ సంపత్

వేలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరువి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో నిర్వహించిన పోటీలో విజేతలకు బహుమతుల ప్రదానం శనివారం రాత్రి జరిగింది. 'మొక్కలు పెంచడం', 'మత్తు మందుల నిర్మూలన' తదితర అంశాలపై విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నరువి వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీ సంపత్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నరువి ఆస్పత్రి హెచ్‌ఆర్ మేనక, ఉపాధ్యక్షులు అనిత, మేనేజింగ్ డైరెక్టర్ డా.పాల్‌హెన్రీ, వైద్యులు సూర్యన్ థామస్, అంబలన్, గుణశేఖరన్, నర్సులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విజయకాంత్ తొలి వర్ధంతికి డీఎంకే, అన్నాడీఎంకేలకు ఆహ్వానం

డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

పెరంబూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయకాంత్ తొలి వర్ధంతికి డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలను ఆహ్వానించనున్నట్లు డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత తెలిపారు. ఈ మేరకు ఆ పార్టీ విడుదల చేసిన ప్రకటనలో.... విజయకాంత్ తొలి వర్ధంతి సందర్భంగా ఈ నెల 28వ తేది పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజలకు సంక్షేమ సహాయాలు అందించాలన్నారు. రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతి భద్రతలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కోవైలో బీజేపీ తరఫున జరిగిన ఆందోళనలో అన్నామలై మాటలు చట్టవిరుద్ధంగా ఉండడంతో ఆయనను అరెస్ట్ చేశారని, చట్టం తన కర్తవ్యాన్ని నిర్వహిస్తుందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే-బీజేపీ కూటమిగా పోటీచేయాలని టీటీవీ దినకరన్ పేర్కొన్నారని, అందరూ ఒకటిగా చేరితే అది కూటమికి బలం చేకూరుస్తుందని, ఈ విషయమై అన్నాడీఎంకే నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో డీఎండీకే చేరిన కూటమి 234 స్థానాల్లో విజయం సాధిస్తుందని ప్రేమలత పేర్కొన్నారు.

అక్రమంగా ఉంటున్న శ్రీలంక వాసుల అరెస్ట్

ఐసిఎఫ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాంగాడు ప్రాంతంలో అక్రమంగా బసచేస్తున్న శ్రీలంక వాసులను క్యూ బ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే... శ్రీలంకకు చెందిన నవనాథన్ (42) కుటుంబ కలహాలతో భార్యను వదిలి 2015లో మాంగాడు ప్రాంతానికి పడవలో వచ్చి బట్టల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నట్లు మాంగాడు పోలీసులకు తెలిపాడు. ఇదిలా ఉండగా, నవనాథన్ నకిలీ పత్రాలతో ఆధార్ కార్డు పొందాడు. మరో శ్రీలంక వ్యక్తి ధన్‌ముకులుడన్ (52) 2019లో శ్రీలంక నుంచి మాంగాడు ప్రాంతానికి వచ్చి వస్త్ర వ్యాపారం చేసుకుంటూ, కూతురి సహా ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నారు. కుమార్తె స్థానికంగా ప్లస్‌టూ చదువుకుంటుంది. వీరి అక్రమ బస సమాచారం అందుకున్న మాంగాడు క్యూ బ్రాంచ్ పోలీసులు కేసు నమోదుచేసుకొని వీరిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

నెల రోజుల తర్వాత జలకాలాడిన 'దేవానై'

అడయార్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చెందూరు సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి చెందిన దేవానై అనే ఆలయ ఏనుగు నెల రోజుల తర్వాత బయటకు వచ్చి నీటితో స్నానం చేసింది. గత నెల 18వ తేదీ ఈ ఏనుగు దాడిలో మావటి ఉదయకుమార్, ఈయన బంధువు శిశుపాలన్ మరణించిన విషయం తెల్సిందే. ఈ ఘటన తర్వాత ఆలయ ఏనుగును అటవీ శాఖ, పశు సంవర్ధక శాఖ జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖ రక్షణలో మావటిల పర్యవేక్షణలో ఉంచారు. ఈ ఏనుగు నెల రోజుల పాటు క్యాంపులో ఉంచగా, శనివారం బయటకు తీసుకొచ్చారు. ఆ ఏనుగు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి తొట్టెల వద్దకు వచ్చి తొండంతో నీటిని చల్లుకుంటూ ఎంతో ఉత్సాహకంగా కనిపించింది.

సదాశివ కోనలో దారి తప్పిన తాంబరం యువకుడు

● రక్షించిన ఆంధ్రా పోలీసులు

వడమాలపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లా వడమాలపేట మండల పరిధిలోని సదాశివ కోనకు వెళ్లి వస్తుండగా తప్పిపోయిన యువకుడిని సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా పోలీసులు రక్షించారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో జరిగింది. చెన్నై నగరం తాంబరానికి చెందిన 20 మంది యువకులు ఆదివారం ఉదయం ఏర్పేడు మండలం చెల్లూరు, పాయల్ సెంటర్ మీదుగా సదా శివ కోనకు నడిచి వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా సదాశివ కోన ప్రాజెక్టుకు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో దినేష్ దారి తప్పాడు. మిగిలిన వారి ఆచూకీ తెలియక ప్రాజెక్టు వద్దకు చేరుకున్నాడు. చేసేది లేక రాత్రి 8.30 గంటల సమయంలో నెం.100కు ఫోన్ చేశాడు. పుత్తూరు సీఐ రవీంద్ర వెంటనే స్పందించారు. వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి, కానిస్టేబుళ్ల సురేష్, డిల్లీబాబును యువకుడిని వెదకడానికి పురమాయించారు. వారు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా యువకుడి ఆచూకీ గుర్తించారు. అటవీశాఖ సిబ్బంది సాయంతో బ్యాటరీ లైట్ల సాయంతో యువకుడిని చేరుకున్నారు. ఎట్టకేలకు యువకుడిని వారి బృందానికి అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్ మృతి




మోహన్‌రాజ్ (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్ మృతి చెందిన ఘటన తిరువళ్లూర్ జిల్లాలో చోటుచేసుకుంది. పల్లిపట్టు బజార్ వీధికి చెందిన మోహన్‌రాజ్ (35) అదే ప్రాంతంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి మోహన్‌రాజ్ తన ద్విచక్రవాహనంపై షోలింగర్-తిరుత్తణి రోడ్డులో వస్తుండగా, ఆర్కే పేట వద్ద తిరుత్తణి నుంచి వేలూరు వైపు వెళ్తున్న బస్సు ఢీకొంది. ఈ ఘటనలో కిందపడిన మోహన్‌రాజ్ తలపై బస్సు చక్రం వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకొని ఘటనా స్థలానికి చేరుకున్న ఆర్కే పేట పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అసిస్టెంట్ జైలర్ వికృత చేష్టలు

● అరెస్టు చేసిన పోలీసులు





మదురై సెంట్రల్ జైలు అసిస్టెంట్ జైలర్ బాలగురుసామి

చెన్నై, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): మదురైలో ఓ మాజీ ఖైదీ నడుపుతున్న భోజనశాల వద్ద ఆమె కుమార్తె, మనవరాలిపై లైంగిక వేధింపులకు పాల్పడిన సెంట్రల్ జైలు అసిస్టెంట్ జైలర్ బాలగురుసామిని పోలీసులు అరెస్టు చేశారు. కొన్నేళ్ల క్రితం ఓ కేసులో కొంతకాలంపాటు జైలు శిక్ష అనుభవించి విడుదలైన మదురైలోని ఓ ప్రాంతానికి చెందిన ఖైదీ బ్రతుకు తెరువు కోసం రోడ్‌సైడ్ హోటల్ నడుపుతున్నారు. అసిస్టెంట్ జైలర్ బాలగురుసామికి ఆ మాజీ ఖైదీతో పరిచయం ఏర్పడింది. తరచూ రోడ్‌సైడ్ హోటల్‌కు వచ్చే బాలగురుసామి ఖైదీ కుమార్తెను లైంగిక వేధింపులకు గురిచేసేవాడు. అతడి మాటలకు లొంగకపోవడంతో ఖైదీ మనవరాలి ద్వారా ఆమెను లొంగదీసుకునేందుకు ప్రయత్నించాడు. ఆ బాలిక అసిస్టెంట్ జైలర్ చేష్టలకు భయపడి హోటల్‌లో ఉన్న తన చిన్నమ్మకు విషయం తెలిపింది. ఆలోగా అసిస్టెంట్ శనివారం ఉదయం ఓ ఏటిఎం దగ్గరకు రమ్మని పిలిచాడు. విషయం తెలుసుకున్న బాలిక చిన్నమ్మ, ఆమె తండ్రితో కలిసి ఆ ఏటిఎం సెంటర్‌కు వెళ్లి బాలిక కోసం ఎదురు చూస్తున్న అసిస్టెంట్ జైలర్‌ను చుట్టుముట్టారు. ఆ తర్వాత బాలిక చిన్నమ్మ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడతావా అంటూ అతడి చెంప చెళ్లుమనిపించింది. బాలగురుసామి మఫ్టీలో ఉండటంతో ఎవరూ గుర్తించలేదు. అయితే ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో రావడంతో రంగంలోకి దిగిన పోలీసు ఉన్నతాధికారులు ఆ అసిస్టెంట్ జైలర్ బాలుగురుసామిపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఆదివారం ఉదయం అతడిని అరెస్టుచేసి మదురై సెంట్రల్ జైలుకు తరలించారు.

రైల్వేస్టేషన్‌లో వృద్ధురాలి హత్య

ఐసిఎఫ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైదాపేట రైల్వేస్టేషన్‌లో ఓ వృద్ధురాలు హత్యకు గురైన ఘటన తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే... సైదాపేట రైల్వేస్టేషన్ ప్రాంతంలో శనివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఓ వృద్ధురాలు హత్యకు గురైనట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో, ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించిన పోలీసులు, వృద్ధురాలి పేరు లక్ష్మి (65) అని, భిక్షాటన చేస్తూ రైల్వేస్టేషన్‌లో కొంతకాలంగా ఉంటున్నట్లు తెలిసింది. అయితే శుక్రవారం సాయంత్రం అదే ప్రాంతంలో భిక్షాటన చేస్తున్న దివ్యాంగుడికి, లక్ష్మికి ఘర్షణ జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. కేసు నమోదుచేసిన రైల్వే పోలీసులు, వృద్ధురాలిని ఆ దివ్యాంగుడే హతమార్చాడా? హత్యకు మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో విచారణ చేపట్టారు.

చెత్తకుప్పల్లో పసికందు మృతదేహం

ఐసిఎఫ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదంబాక్కం కక్కన్ వంతెన సమీపంలో ఉన్న చెత్తకుప్ప నుంచి దుర్వాశన రావడంతో స్థానికులు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్ కార్మికులు చెత అక్కడి తొలగించే క్రమంలో చెత్త అడుగు భాగాననల్లటి ప్లాస్టిక్ సంచి నుంచి దుర్గంధం రావడంతో, సంచి తెరచి చూడగా, అందులో పసికందు మృతదేహం చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదుచేయగా, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఈ పసికందు మృతదేహాన్ని ఎవరు వేశారు? అనే కోణంలో విచారణ చేపట్టారు.

ఆడ పులి కళేబరం లభ్యం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముదుమలై పులుల శరణాలయం పరిధిలోని తొట్టకట్టికూడల్ అటవీ ప్రాంతంలో ఆడ పులి కళేబరాన్ని స్థానికులు గుర్తించారు. వారి సమాచారంతో వెటర్నరీ వైద్యులతో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. పులి కళేబరానికి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఆ ప్రాంతంలోనే ఖననం చేశారు. పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత పులి మృతికి కారణాలు తెలిసే అవకాశముందని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల వ్యాన్ బోల్తా

● పరుగులు తీసిన ప్రజలు

ప్యారీస్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపంలోని తటాకం రోడ్డులో గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. బోల్తాపడిన వ్యాన్ నుంచి సిలిండర్లు దొర్లుకుంటూ రావడం చూసిన స్థానికులు భయంతో పరుగులు తీశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. తటాకం రోడ్డు క్రాసింగ్ నర్సరీ ప్రాంతంలో శనివారం ఉదయం సిలిండర్ల లోడుతో వస్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లోని గ్యాస్ సిలిండర్లు దొర్లుకుంటూ రోడ్లపైకి వచ్చేసరికి అది చూసిన జనం తమ వాహనాలు వదిలేసి భయంతో పరుగులు తీశారు. ఈ ఘటనలో డ్రైవర్‌కి స్వల్ప గాయాలు కాగా అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. అందిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్ ఇంట్లో బంగారు నగల చోరీ

ప్యారీస్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా వాడవల్లి సమీపంలోని పెరియార్ నగర్‌లో కలైవాణి అనే ఉపాధ్యాయురాలి ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 58 సవర్ల బంగారు నగలు, నగదు దోచుకెళ్ళారు. వాడవల్లిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కలైవాణి శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లగా, కుటుంబ సభ్యులు కూడా బయటకు వెళ్లారు. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగులగొట్టి 58 సవర్ల బంగారు నగలు, రూ.1.50 లక్షలు నగదు దోచుకెళ్ళారు. సాయంత్రం ఇంటికి తిరిగొచ్చిన కుటుంబ సభ్యులు ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి లోనికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారం, నగదు దోపిడీకి గురైనట్లు తెలుసుకుని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఇంటి బయట ఉన్న సీసీ కెమెరాలో చూడగా ఇద్దరు వ్యక్తులు ఆ ఇంట్లోకి చొరబడుతున్న దృశ్యాలు కనిపించాయి. ఆ వీడియో ఆధారంగా దోపిడీ దొంగల ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

తిరునల్వేలిలో వైద్యవ్యర్థాల లారీ స్వాధీనం

ప్యారీస్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కేరళ నుంచి తిరునల్వేలికి మెడికల్ వ్యర్థాలను తీసుకొస్తున్న లారీని పోలీసులు సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే తిరునల్వేలి, పాలవూరు ప్రాంతంలోని ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఔట్‌లైట్ భూముల్లో ప్రతి రోజు కేరళ నుంచి వివిధ ఆస్పత్రి వ్యర్థాలను తీసుకొచ్చి పారవేస్తున్నట్లుగా అక్కడి ప్రజల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనుమతిలేని వాహనాలను పట్టుకోవాలని పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో చెక్‌పోస్ట్ వైపు వస్తున్న ఓ లారీని తనిఖీ చేయగా అందులో మెడికల్ వ్యర్థాల బస్తాలుండటం గమనించిన పోలీసులు వెంటనే లారీని సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటమునిగి విద్యార్థి మృతి



మృతుడు జెబరాజ్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈత తెలియని విద్యార్థి, చెరువులో సరదాగా స్నానం చేస్తూ నీటమునిగి మృతిచెందిన ఘటన తిరునల్వేలి జిల్లాలో చోటుచేసుకుంది. దిశయన్‌విలై సమీపంలోని గ్రామానికి చెందిన జెబరాజ్ ఏడో తరగతి చదువుతున్నాడు. శనివారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న జెబరాజ్, నందన్‌కుళం చెరువులో స్నానం చేసేందుకు దిగాడు. ఊహించని విధంగా లోతైన ప్రాంతానికి వెళ్లిన జెబరాజ్ నీటమునిగాడు. బాలుడు మునిగిపోవడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకొని రెండు గంటలు గాలించి జెబరాజ్ మృతదేహాన్ని వెలికితీశారు. చెరువు అడుగున ఉన్న బురదలో విద్యార్థి చిక్కుకోవడంతో మృతిచెందినట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారించారు.

డివైడర్‌ను ఢీకొన్న బైకు : ఇద్దరి మృతి



మృతి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు (ఫైల్‌ఫొటో) ప్రమాదానికి కారణమైన బైకు

చెన్నై, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరి మెయిన్‌రోడ్డు ఆదిపురీశ్వర్ శివాలయం సమీపంలో ఆదివారం వేకువజామున బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు దుర్మరణం చెందారు. పమ్మల్ సెల్వ వినాయకర్ కోవిల్ వీధి శంకర్‌నగర్ మెయిన్‌రోడ్డులో నివసిస్తున్న గోకుల్ (24) కందన్‌చావిడిలో ఉన్న సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నారు. అదే సంస్థలో కేరళకు చెందిన విష్ణు (24.) పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి వీరిద్దరూ కలిసి పళ్ళికరణైలో ఉంటున్న స్నేహితుడి ఇంటికి బైకుపై వెళ్ళారు. అప్పటికే ఆ ఇంటిలో మరికొంతమంది స్నేహితులు కూడా ఉన్నారు. వారంతా కలిసి పార్టీ చేసుకుని మద్యం సేవించారు. ఆదివారం వేకువజామున మద్యం కొనేందుకు మృతులిద్దరూ వేళచ్చేరి వైపున్న బార్‌కు బైకులో బయలుదేరారు. వేళచ్చేరి మెయిన్‌రోడ్డులో బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇద్దరూ మరణించారు. ఈ సమాచారం అందుకుని పళ్ళికరణై పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరువురి మృతదేహాలన పోస్టుమార్టంకు తరలించారు. మద్యం మత్తులో బైకును నడపటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు విచారణలో వెల్లడైంది.

టంగ్ స్టన్ మైనింగ్‌పై ప్రజా నిరసన

ప్యారీస్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా మేలూరు సమీపంలోని అరిటాపట్టి గ్రామస్థులు టంగ్ స్టన్ మైనింగ్ ఏర్పాటుపై నిరసన వ్యక్తం చేశారు. దీనిపై ఈ ఆదివారం ఉదయం గ్రామంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు మాట్లాడుతూ.. విస్తృతంగా కొండలు, పర్వతాలు కలిగిన ఈ ప్రాంతం పురావస్తు కేంద్రంగా విరాజిల్లుతోందని, ఊరి సమీపంలోని కొండలపై బౌద్ధ, జైన శిల్పాలతో పాటు కుడైవర శివాలయం, ప్రాచీన తమిళ శాసనాలున్నాయని, మైనింగ్ కారణంగా అంతటి చారిత్రాత్మక సంపదను కోల్పోవల్సివస్తుందన్నారు. ప్రాముఖ్యత కలిగిన అరిటాపట్టి కొండ ప్రాంతంలో టంగ్‌స్టన్ మైనింగ్ ఏర్పాటు చేయడం బాధాకరమని, గ్రామ కౌన్సిల్ సమావేశంలో కూడా తీర్మానం చేశారు. అయినప్పటికీ హిందుస్థాన్ జింక్, వేదాంత గ్రూప్ వారికి కేంద్ర ప్రభుత్వం అనుమతించడంపై తీవ్రంగా వ్యతిరేకిస్తూ, టంగ్‌స్టన్ మైనింగ్ ఏర్పాటు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకొనేంత వరకు ఈ నిరసన కొనసాగిస్తామని గ్రామస్థులు పేర్కొన్నారు.

రతన్ టాటా చిత్రంతో కేక్

● ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు



బేకరీలో ఏర్పాటుచేసిన రతన్ టాటా చిత్రంతో కేక్

పెరంబూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటా చిత్రంలో కేక్ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బేకరీలు పలు రకాల డిజైన్లతో కేక్‌లు తయారుచేస్తున్నాయి. రామనాథపురం భారతి నగర్ ప్రాంతంలోని బేకరీలో ఏర్పాటుచేసిన ఏడడుగుల కేక్ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటా రూపంతో ఈ కేక్ రూపొందించారు. ఈ విషయమై బేకరీ యజమాని మాట్లాడుతూ... 60 కిలోల చక్కెర, 250 కోడిగుడ్లు వినియోగించి ఏడడుగుల ఎత్తున తయారుచేసిన రతన్ టాటా విగ్రహం ప్రజలను ఆకట్టుకుంటోందని ఆయన తెలిపారు. తన పెంపుడు శునకాన్ని రతన్ టాటా తాకుతున్నట్లు రూపొందిన ఈ కేక్ వద్ద పిల్లలు, పెద్దలు సెల్ఫీ తీసుకుంటున్నారు.

ఆకట్టుకుంటున్న సాగర కన్య విన్యాసాలు



పెరంబూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ కాంగేయం రోడ్డు సమీపం పద్మిని గార్డెన్‌లో ఏర్పాటుచేసిన 'సీ మైడెన్ ఎగ్జిబిషన్' ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. క్రిస్మస్, న్యూ ఇయర్, పొంగల్ పండుగల సందర్భంగా జనవరి 19వ తేది వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ వీక్షించవచ్చు. ఎగ్జిబిషన్ హాలులోకి ప్రవేశించిన వెంటనే, ఈఫిల్ టవర్, టైగర్, సీతాకోక చిలుక సహా వాస్తవిత చిత్రాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. ఇక, గుహలో ప్రవేశిస్తే కళ్లు చెదిరే రంగు రంగుల తొట్టెలు, వాటిలో 80కి పైగా రకరకాల చేపలు మరింత ఆహ్లాదం కలిగిస్తాయి. ఒక్కసారిగా సాగర కన్య ప్రత్యక్షమవడం సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది. ఈ ఎగ్జిబిషన్‌లో జెయింట్ వీల్, రోలర్ కోస్టర్, బ్రేక్ డాన్స్, వాటర్ బోట్, బెలూన్ రైడ్, 3డీ హాంటెడ్ హౌస్ సహా పలు అంశాలు చోటుచేసుకున్నాయని ప్రహల్య విజన్ డైరెక్టర్ కనకరాజ్ తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో లేబాకు ఇమ్మానుయేలు, సెల్విన్ జెబరాజ్, చిన్నారులు తదితరులు

ప్యారీస్, డిసెంబర్22(ఆంధ్రజ్యోతి): స్థానిక పురుషవాకం, రిథర్డన్ రోడ్డులో ఉన్న బీకేఎన్ హాలులో జీసస్ ట్రూత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎల్.జోసఫ్, కార్యదర్శి ఈ.దేవదానం పరివేక్షణలో శనివారం సెమీక్రిస్మస్ వేడుకలను రెవ. లేబాకు ఇమ్మానుయేలు ప్రత్యేక ప్రార్థనతో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా మెథడిస్ట్ చర్చ్ ఆఫ్ ఇండియా చెన్నై రీజనల్ మెనేజర్ సెల్విన్ జెబరాజ్ పాల్గొని కేక్ కట్ చేశారు. చిన్నారులు శాంటాక్లాజ్ వేషధారణలో అలరించారు.

లింగ వివక్ష లేని సమాజం

● సదస్సులో వక్తల పిలుపు



సదస్సులో ప్రసంగిస్తున్న రసికా సుందరం

పెరంబూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష లేని సమాజం కోసం అందరూ కృషిచేయాలని రసికా సుందరం పిలుపునిచ్చారు. ఇమార సర్వైవర్ సపోర్ట్ ఫౌండేషన్, గీతా భవన్ ట్రస్ట్ సౌజన్యంతో 'కమిటెడ్ టు ప్రివెంటింగ్ జెండర్ బేస్డ్ వయొలెన్స్ (జీబీవీ) అనే అంశంపై ఒక రోజు సదస్సు నిర్వహించారు. గోపాలపురంలోని గీతా భవన్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇమార సర్వైవర్ సపోర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రసికా సుందరం మాట్లాడుతూ... లింగ ఆధారిత హింస ఏ రూపంలో ఉన్నా వాటిని అడ్డుకోవాలని కోరారు. సదస్సులో జీబీవీకి సంబంధించిన చట్టాలు, హక్కులు సహా పలు అంశాలపై నిపుణులు వివరించారు. సదస్సులో పాల్గొన్న నిర్వాహకులు, అతిథులు, నిపుణులను గీతా భవన్ ట్రస్టీ మనోగోయల్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలు కళాశాలల విద్యార్థులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

లైట్ హౌస్‌లో కొత్త రాడార్ ఏర్పాటు



భారీ క్రేన్ సాయంతో లైట్ హౌస్‌పై రాడార్ అమర్చుతున్న దృశ్యం

ఐసిఎఫ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా తీరంలో ఉన్న లైట్ హౌస్‌పై 11 అంతస్తుల ఎత్తులో రాడార్ టవర్ ఉంది. ఈ టవర్ ద్వారా పడవలు, నౌకలు 100-150 నాటికల్ మైళ్ల దూరం వరకు లైట్, సిగ్నల్స్ అందిస్తోంది. ఈ సిగ్నల్స్‌ను మెరైన్ పోలీసులు భద్రతకు నిత్యం పర్యవేక్షిస్తుంటారు. ఇటీవల ఈ రాడార్ మరమ్మతులకు గురికావడంతో, బెంగళూరు నుండి కొత్త రాడార్ పరికరాన్ని అధికారుల తెప్పించారు. ఈ రాడార్‌ను ఆదివారం భారీ క్రేన్ సహాయంతో లైట్ హౌస్‌పై అమర్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

పోరూర్‌లో రామ్‌రాజ్ కాటన్ షోరూం

చెన్నై, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వస్త్ర రంగంలో ప్రసిద్ధి చెందిన 'రామ్ రాజ్ కాటన్' స్థానిక పోరూరు కారంబాక్కంలోని ఆర్కాట్ రోడ్డులో నూతన షోరూం ప్రారంభించింది. ఆదివారం మదురవాయిల్ ఎమ్మెల్యే కె.గణపతి షోరూంను ప్రారంభించగా, 151వార్డు కౌన్సిలర్ మెంబర్ ఎస్.శంకర్ గణేష్ జ్యోతి ప్రజ్వలన చేశారు. పోరూర్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ పి.కాళీయ సుందరం తొలి విక్రయాలను ప్రారంభించగా ప్రముఖ పారిశ్రామిక వేత్త ఎస్.కుమరేశన్ స్వామినాథన్ అందుకున్నారు. రామ్‌రాజ్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ కె.ఆర్.నాగరాజన్ అతిథులను స్వాగతం పలికారు. ఈ షోరూంలో ఫ్యాన్సీ బోర్డర్, స్టెయిన్ గార్డ్, పెర్ఫ్యూమ్డ్ ధోతీలతో పాటు అన్ని వర్గాలను ఆకర్షించే వివిధ రకాల సంప్రదాయ దుస్తులు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.



షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణపతి

చైనాలో 'మహారాజ' సత్తా

'బాహుబలి'ని అధిగమించిన వసూళ్లు



'మహారాజ'లో ఓ దృశ్యం

విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో నితిలన్ స్వామినాథన్ దర్శకత్వం వహించిన 'మహారాజ' సినిమా విడుదలైన అన్ని చోట్లా ఘన విజయం సాధించింది. అతి తక్కువ బడ్జెట్‌లో రూపొందిన ఈ సినిమా ఏకంగా రూ.100 కోట్లకుపైగా వసూళ్ళను రాబట్టింది. ఈ నేపథ్యంలో ఇటీవల చైనాలో విడుదలైన ఈ సినిమా అక్కడ కూడా సూపర్‌హిట్ టాక్‌ను సొంతం చేసుకుని కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది. ఈ మూవీకి చైనా ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టడంతో రూ.100 కోట్లకు పైగా వసూళ్ళను రాబట్టవచ్చని భావిస్తున్నారు. ఇప్పటివరకు చైనాలో 'బాహుబలి-2' కలెక్షన్లు మాత్రమే అత్యధికం. ఇపుడు 'మహారాజ' సినిమా ఈ కలెక్షన్లన అధిగమించింది. అంతేకాకుండా, చైనాలో అత్యధిక వసూళ్ళు సాధించిన టాప్-10 చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. మరోవైపు, ఈ మూవీ ప్రపంచ వ్యాప్తంగా రూ.193 కోట్ల మేర వసూలు చేసినట్టు సమాచారం. ప్యాషన్ స్టూడియోస్, ది రూట్ సంస్థ సంయుక్తంగా నిర్మించగా, మమతా మోహన్‌దాస్, అనురాగ్ కశ్యప్, నట్టి నటరాజ్, సింగంపులి తదితరులు నటించారు.

ఆ ఇద్దరిలో గోల్డెన్ ఛాన్స్ ఎవరికో?

చిత్రజ్యోతి



చిరుత్తై శివ, అజిత్, వెంకట్ ప్రభు

ప్రస్తుతం అగ్రహీరో అజిత్ కుమార్ నటిస్తున్న రెండు చిత్రాల షూటింగులు తుదిదశకు చేరుకున్నాయి. ఆ తర్వాత ఎవరి దర్శకత్వంలో నటిస్తారోనన్న చర్చ ఇపుడు కోలీవుడ్‌లో సాగుతుంది. అజిత్ హీరోగా 'విడాముయర్చి', 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాలు తెరకెక్కుతున్నాయి. వీటిలో ఒకటి సంక్రాంతికి విడుదలకానుంది. వాటి తర్వాత ఆయన చిరుత్తై శివ, వెంకట్ ప్రభు దర్శకత్వంలో నటించే అవకాశం ఉందనే వార్తలు వస్తున్నాయి. చిరుత్తై శివ దర్శకత్వంలో అజిత్ ఇప్పటికే నాలుగు చిత్రాల్లో నటించారు. మరోమారు అవకాశం ఇస్తే ఐదోసారి నటించినట్టు అవుతుంది. కానీ, ఆయన తాజాగా దర్శకత్వం వహించిన 'కంగువా' భారీ డిజాస్టర్‌గా నిలిచింది. ఇది సగటు అభిమానిని సైతం విస్మయానికి గురిచేసింది. ఇలాంటి పరిస్థితుల్లో శివకు మరోమారు అజిత్ ఛాన్స్ ఇస్తారా? లేదా? అన్నది ఇపుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది. మరోవైపు, గతంలో అజిత్ హీరోగా 'మంగాత్త' వంటి హిట్ మూవీని వెంకట్ ప్రభు తెరకెక్కించారు. ఇటీవల విజయ్ హీరోగా 'ది గోట్'తో మరో బ్లాక్‌బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్నారు. తన తదుపరి చిత్రాన్ని శివకార్తికేయన్‌తో తీయాలని ఈ దర్శకుడు భావించినప్పటికీ అది సాధ్యపడలేదు. 2026 వరకు ఖాళీలేదని హీరో చెప్పడంతో వెంకట్ ప్రభు హీరో అజిత్‌ను సంప్రదించి కథ వినిపించినట్టు సమాచారం. అయితే, ప్రస్తుతం కార్ రేస్ పోటీలకు సిద్ధమవుతున్న అజిత్... ఆ పోటీల తర్వాత ఈ ఇద్దరు దర్శకులతో మరోమారు మాట్లాడి... తన కొత్త చిత్రం దర్శకుడు ఎవరన్నది క్లారిటీ ఇస్తారని భావిస్తున్నారు.



రజనీ.. స్టార్ అనే విషయం తెలియదు

● నయనతార

హీరోయిన్ నయనతార మరోమారు విమర్శల్లో చిక్కుకున్నారు. 'చంద్రముఖి' చిత్రం షూటింగ్ సమయంలో రజనీకాంత్ ఓ సూపర్‌స్టార్ అనే విషయం తనకు తెలియదని నయనతార వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై ఆయన అభిమానులు నయనతారను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తున్నారు. నయనతార తాజాగా ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. 'చంద్రముఖి' షూటింగ్ సమయంలో రజనీకాంత్ పెద్ద స్టార్ హీరో అనే విషయం నాకు తెలియదు. ఈ సినిమా షూటింగ్ సమయంలో తొలిరోజే ఆయనతో కలిసి నటించాను. ఆ సమయంలో ఆయన సూపర్ స్టార్ అని తెలిసివుంటే ఖచ్చితంగా నాలో భయం వచ్చివుంటుంది. పైగా గొప్ప హీరో తెలిస్తే సహజంగానే అలాంటి వారి ముందు నటించాలంటే భయం వస్తుంది. సహజసిద్ధంగా నటించలేం' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై రజనీకాంత్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నయనతార హాలీవుడ్ నుంచి కోలీవుడ్‌కు వచ్చారా? 'ముత్తు' సినిమాతో రజనీకాంత్ పేరు ప్రఖ్యాతలు జపాన్ వరకు విస్తరించాయన్న విషయం కూడా తెలియదా? పైగా పొరుగు రాష్ట్రమైన కేరళకు చెందిన నయనతార.. మా అభిమాన నటుడు గురించి తెలియదని చెప్పడం విచిత్రంగా ఉందంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెనక్కి తగ్గిన 'బాటిల్ రాధ'



'బాటిల్ రాధ'లో గురు సోమసుందరం

విలక్షణ నటుడు గురు సోమసుందరం ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'బాటిల్ రాధ'. ఈ నెల 20వ తేదీన విడుదల చేయాలని భావించి, వచ్చే నెల 24వ తేదీకి వాయిదా వేశారు. ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ నీలం ప్రొడక్షన్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రంలో గురు సోమసుందరంతో పాటు సంజనా నటరాజన్, జాన్ విజయ్, మారన్, ఆంటోనీ తదితరులు నటించారు. పా.రంజిత్ వద్ద అసిస్టెంట్‌గా అనేక చిత్రాలకు పనిచేసిన దినకరన్ శివలింగం ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం టీజర్ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. కొన్ని అనివార్య కారణాలతో డిసెంబరు 20వ తేదీ విడుదల చేయాల్సిన మూవీని జనవరి 24వ తేదీకి వాయిదా వేసినట్టు దర్శక, నిర్మాతలు ప్రకటించారు. దర్శకుడు దినకరన్ మాట్లాడుతూ, 'మద్యానికి బానిస అయిన తాపీ మేస్త్రీగా గురు సోమసుందరం నటించారు. నమ్మకం, కామెడీ అంశాల మేళవింపుతో తెరకెక్కించాం. తనకున్న నమ్మకంతో ఒక సమస్య నుంచి మద్యానికి బానిసైన వ్యక్తి ఎలా గట్టెక్కాడన్న కథాంశంతో రూపొందించాం' అన్నారు.

పాంబన్ కొత్త వంతెన

ప్రారంభోత్సవం ఎప్పుడో?



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న కొత్త రైల్వే వంతెన

● చివరిదశ తనిఖీకి రానున్న ప్రత్యేక కమిటీ

టి.నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాంబన్ కొత్త రైల్వే వంతెన నిర్మించి, ఆ వంతెన రైలు మార్గంపై రైళ్లను పరుగులు తీయించి, తనిఖీ కూడా పూర్తయినప్పటికీ ఆ వంతెన ప్రారంభోత్సవం మరింత జాప్యం అవుతున్నట్లు తెలుస్తోంది. రైల్వే భద్రతా విభాగం కమిషనర్ ఆ వంతెనలో కొన్ని లోపాలున్నట్లు ప్రకటించడంతో, ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్దే పనులు జరుగుతున్నాయి. ఆంగ్లేయుల కాలంలో చెన్నై నుంచి శ్రీలంకలోని కొలంబో వరకు రవాణా సదుపాయం కల్పించాలని ప్రాజెక్టులను రూపొందించారు. ఆ మేరకు చెన్నై ఎగ్మూరు నుంచి ధనుష్కోడి వరకు రైలులో ప్రయాణం, ధనుష్కోడి నుండి తలైమన్నార్ దాకా నౌకాయానం, మళ్ళీ తలైమన్నార్ నుండి కొలంబో వరకూ రైలు ప్రయాణ సదుపాయం కల్పించేలా భారీ రైల్వే ప్రాజెక్టు సిద్ధం చేశారు. ఆ ప్రాజెక్టు అమలులో భాగంగా రామనాథపురం మండపం ప్రాంతం నుండి రామేశ్వరం దీవిలోని పాంబన్ ప్రాంతం వరకు రైల్వే వంతెన నిర్మాణ పనులు 1911లో ప్రారంభించి, 1913లో పూర్తి చేశారు. చెన్నై ఎగ్మూరు నుండి ధనుష్కోడి ఆ పాంబన్ రైలు వంతెన మీదుగా 1914 ఫిబ్రవరి 24న రైలు రవాణా ప్రారంభమైంది. పాతబడిన పాంబన్ వంతెన రైలు మార్గంలో అప్పటి నుండి ఇప్పటి దాకా (110 యేళ్ల వరకూ) రైళ్ల పరుగులు తీశాయి.

ట్రయల్ రన్‌లు...

పాంబన్ కొత్త రైల్వే వంతెనపై ప్రయోగాత్మకంగా కొన్ని రైళ్లతో ట్రయల్ రన్ జరిపారు. నిలువుగా ఉండే సస్పెన్షన్ బ్రిడ్జిని పైకి, కిందకు కదిల్చి విజయవంతంగా పరీక్షించారు. నవంబర్ 13, 14 తేదీల్లో రైల్వే భద్రతా విభాగం కమిషనర్ ఏఎం చౌదరి ఈ రైలు వంతెన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆ తర్వాత ఈ కొత్త రైలు వంతెనపై గంటకు 50 కి.మీ.ల వేగంతో రైళ్లను నడుపవచ్చంటూ రైల్వే మంత్రిత్వ శాఖకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. అంతే కాకుండా కొన్ని స్వల్పమైన లోపాలున్నట్టు వివరించి, వాటిని చక్కదిద్దిన తర్వాతే కొత్త రైలు వంతెనపై రైళ్లను నడపాలన్నారు.

ఐదుగురితో కమిటీ...

రైల్వే భద్రతా విభాగం కమిషనర్ సూచనల మేరకు పాంబన్ కొత్తరైలు వంతెనలోని లోపాలను చక్కదిద్దే పనులు ఇటీవలే పూర్తయ్యాయి. ఇదిలా ఉండగా రైల్వే భద్రతా విభాగం కమిషనర్ ఏఎం చౌదరి సూచించిన లోపాలన్నీ సరిచేశారా లేదా అని పరిశీలించేందుకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఐదుగురు నిపుణులతో ఓ కమిటీని నియమించారు. ఈ విషయమై రైల్వే ఉన్నతాధికారులు మాట్లాడుతూ రైల్వే భద్రతా విభాగం కమిషనర్ తెలిపిన లోపాలన్నింటినీ సరిచేశామన్నారు. రైలు వంతెన పటిష్టంగా ఉందా అని పరిశీలించేందుకు ఐదుగురు సభ్యుల కమిటీ త్వరలో రానున్నదని తెలిపారు. ఆ కమిటీ సభ్యులు కొత్తరైలు వంతెన పరిశీలించిన మీదట రైల్వే మంత్రిత్వ శాఖకు నివేదిక సమర్పించనున్నారని, ఆ తర్వాతే ఈ రైలు వంతెన ప్రారంభోత్సవ తేదీని అధికారికంగా ప్రకటిస్తారని చెప్పారు. ఈ చివరి దశ తనిఖీలు, పరిశీలన ఈ నెలాఖరులోగా పూర్తవుతాయన్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ రైలు వంతెన ప్రారంభోత్సవం వచ్చే యేడాది జనవరి మొదటివారం లేదా రెండో వారంలో జరిగే అవకాశాలున్నాయని, ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో ప్రధాని నరేంద్రమోదీ ఈ రైలు వంతెనను ప్రారంభించనున్నారని ప్రస్తుతం ప్రారంభోత్సవ ముందస్తు ఏర్పాట్లపై దృష్టిని సారించినట్లు అధికారులు పేర్కొన్నారు.

రూ.535 కోట్లతో కొత్త రైల్వే వంతెన

గత కొన్నేళ్లుగా ఆ వంతెనలో తరచూ సాంకేతిక లోపాలు ఏర్పడుతూ వచ్చాయి. పట్టాల్లో పగులు కూడా అధికమయ్యాయి. దీంతో రూ.535 కోట్లతో కొత్త రైలు వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆ ప్రకారం 2019 మార్చి 1న ప్రధాని నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్త రైల్వే వంతెనకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత కరోనా లాక్‌డౌన్ పరిస్థితుల కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. ఆ తరువాత నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. నవంబర్‌లో అన్ని పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. సముద్రమట్టం నుండి 6 మీటర్ల ఎత్తున, 2078 మీటర్ల పొడవునా ఈ రైల్వే వంతెన నిర్మించారు. 333 కాంక్రీట్ బేస్‌మెంట్లు, 101 స్తంభాలు, 99 అనుసంధాన గర్డర్లతో వంతెన నిర్మాణం జరిగింది.. దేశంలోనే తొలిసారిగా ఈ రైల్వే వంతెన మధ్యలో నిలువుగా సస్పెన్షన్ బ్రిడ్జి కూడా కొత్త సాంకేతిక పద్ధతులతో నిర్మించారు. దీని ఎత్తు 27 మీటర్లు, పొడవు 77 మీటర్లు, వీటి సమీపంలో రెండంతస్తుల్లో ఆపరేటర్ గది, ట్రాన్స్‌ఫార్మర్ గది, ఎలక్ట్రిక్ కేబుళ్లను భద్రపరిచే గదులు కూడా నిర్మించారు. ఈ కొత్త పాంబన్ రైల్వే వంతెన కాలపరిమితిని 58 యేళ్లుగా నిర్ధారించారు.

ఘనంగా ఎంసీటీబీసీ 146వ వార్షికోత్సవం



సంఘకాపరి రెవ.రాజేంద్రప్రసాద్ - దానమ్మ దంపతులను సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

ప్యారీస్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెపేరి హైరోడ్డులోని మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ సంఘం (ఎంసీటీబీసీ) 146వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు ప్రముఖుల సత్కారం, సండేస్కూల్, యూత్, స్త్రీల సమాజం ప్రత్యేక గీతాల ఆలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలతో ఈ వేడుకలు అలరించాయి. సంఘ కాపరి రెవ. డా. ఎస్.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన ఈ వేడుకలకు మినిస్ట్రీ అసోసియేట్ రెవ. ఎం.పీ.ప్రసన్నకుమార్, వివిధ క్రైస్తవ సంఘాల సీనియర్ పాస్టర్లు రెవ.డా.ఎం.పాల్ ఈశ్వరప్ప, బిషప్ ఏబెల్ నీలకంఠన్, రెవ. డా కేజే.కామేశ్వరరావు, రెవ.డా.ఎస్.ప్రకాశ్‌రాజ్, టామ్స్ వ్యవస్థాపకులు డా.గొల్లపల్లి ఇశ్రాయేలు, అధ్యక్షుడు నేలటూరి విజయ్‌కుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గత 30ఏళ్లుగా ఎంసీటీబీసీ కాపరిగా వ్యవహరిస్తున్న రెవ. డా. ఎస్.రాజేంద్రప్రసాద్, పాస్టరమ్మ సొపాటి.దానమ్మ దంపతులను ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని వార్షికోత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. సంఘ కార్యదర్శి పోతల ప్రభుదాస్ 146వ వార్షికోత్సవ నివేదిక చదివి వినిపించారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల బోధకులకు జ్ఞాపికలు, ఫొటో గుర్తింపు కార్డులను అందజేశారు. సంఘ అధ్యక్షుడు జీ.రామయ్య, ట్రెజరర్ ఐ.మార్క్స్, ఎగ్జిక్యూటివ్ కమిటీ, చర్చి ప్రాపర్టీ ప్రిజర్వేషన్ కమిటీ, బిల్డింగ్ కమిటీ, అడ్వైజరీ కమిటీ, సండే స్కూల్, బైబిల్ కాలేజ్, యూత్, స్త్రీల సమాజం నిర్వాహకులు నగరంలోని వివిధ తెలుగు బాప్టిస్టు సంఘాల నిర్వాహకులు పాల్గొన్నారు.

వినయ, విధేయతలే విద్యార్థి విజయానికి సోపానం

● ఆవోపా అధ్యక్షుడు తాడేపల్లి రాజశేఖర్

ప్యారీస్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): వినయ, విధేయతలు కలిగిన విద్యార్థులు జీవితంలో మంచి విజయాలు సాధిస్తారని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్స్ (ఆవోపా) అధ్యక్షుడు తాడేపల్లి రాజశేఖర్ అన్నారు. ఇటీవల జరిగిన ఆవోపా తమిళనాడు 68వ వార్షిక సర్వసభ్య మండలి సమావేశంలో జైరాజ్ గ్రూప్ సంస్థల చైర్మెన్ తాడేపల్లి రాజశేఖర్‌ను ఆవోపా నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మైలాపూర్‌లోని ఆనందం హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆవోపా తమిళనాడు ప్రస్తుత అధ్యక్షుడు టీజీ.శ్రీనివాసన్ నూతన అధ్యక్షుడిగా రాజశేఖర్‌ను సభకు పరిచయం చేసి ఘనంగా సత్కరించి తన బాధ్యతలను అప్పగించారు. మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగే రాజశేఖర్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్, ఐటీ, సీఏ, తదితర ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న మెరిటోరియల్ విద్యార్థులను ప్రోత్సహించేలా గత మూడేళ్లుగా విద్యా ఉపకార వేతనం అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు నాలుగు సంవత్సరాలు కష్టపడి చదువుకుంటే 40 ఏళ్లు సుఖపడతారని సూచించారు. ఆవోపా శాఖలు విస్తరించి సేవా, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేలా తన వంతు కృషిచేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రంగనాథం చెట్టి వార్షిక నివేదిక సమర్పించారు. ఎ.సుధాకర్, పీ.రాధాకృష్ణ, ఇంటర్నేషనల్ వైశ్ ఫెడరేషన్ తమిళనాడు అధ్యక్షుడు అజంతా డా.కనిగెలుపుల శంకరరావు, వామ్ గ్లోబల్ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ, అపోలో సుబ్రహ్మణ్యం, ఎంవీ.నారాయణ గుప్త, కార్తిక్ టిఫిన్ సెంటర్ కేఎన్.సురేష్‌బాబు, కుమారవేలు, కలనిగెలుపుల రాధాకృష్ణమూర్తి, టి.జయశ్రీ రాజశేఖర్ సహా పలు ఆర్యవైశ్య సంఘాలు, వాసవి క్లబ్‌లు, విద్యా, వ్యాపార సంస్థల అధినేతలు ప్రముఖులు పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యాఉపకార వేతనం అందజేస్తున్న ఆవోపా అధ్యక్షుడు తాడేపల్లి రాజశేఖర్ దంపతులు, తదితరులు

గ్లెనీగల్స్ హాస్పిటల్‌లో ఆస్తమా చికిత్స కేంద్రం



చికిత్సా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ జే రాధాకృష్ణన్

చెన్నై, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్లెనీగల్స్ హాస్పిటల్‌లో కొత్తగా ఏర్పాటైన ప్రత్యేక ఆస్తమా చికిత్స కేంద్రాన్ని ఆదివారం ఉదయం రాష్ట్ర సహకార ఆహార వినియోగదారుల సంరక్షణ విభాగం అదనపు ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ జే రాధాకృష్ణన్ ప్రారంభించారు. గ్లెనీగల్స్ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ కేంద్రంలో ఆస్తమా రోగులకు మెరుగైన చికిత్స అందించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో క్లినికల్ లీడ్ కన్సల్టెంట్ డాక్టర్ సురేష్ సహదేవన్, డాక్టర్ అపర్ జిందాల్ తదితరులు పాల్గొన్నారు.

హొగెనేకల్ జలపాతం వద్ద ఆదివారం దోనెలపై షికార్లు చేస్తున్న పర్యాటకులు

